క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



బాధితుడికి ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: కీళ్ల వ్యాధి కారణంగా తొంటి ఎముకల ఆపరేషన్ కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న బాధితుడికి రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శనివారం ఖమ్మంలో ఎల్‌ఓసీ లేఖను అందజేశారు. నగర శివారు ధంసలాపురం కొత్త కాలనీకి చెందిన రవీంద్ర బాబు ఆర్థరైటిస్ వ్యాధితో సక్రమంగా నడవలేని, కూర్చోలేని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రి తరలించగా.. వైద్యులు పరీక్షించి ఆపరేషన్ అవసరమని సూచించారు. దీంతో రవీంద్ర బాబు ఎంపీను ఆశ్రయించగా ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్‌ఓసీ కోసం లేఖ రాయగా.. మంజూరైన రూ.లక్షను ఎంపీ బాధితుడికి అందజేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో స్వర మాధురి కల్చరల్ యూనిట్ ఆధ్వర్యాన శనివారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి కార్యక్రమం అలరించింది. యూనిట్ ప్రతినిధులు, గాయనీ గాయకులు పద్మశ్రీ ఘంటసాల, పద్మభూషణ్ బాల సుబ్రమణ్యం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు, కల్చరల్ యూనిట్ అధ్యక్షుడు ఆదిరాజు పురుషోత్తమరావు, ఉపాధ్యక్షుడు ఎ.పున్నయ్య, కార్యదర్శి ఎస్.ప్రకాశ్, సహాయ కార్యదర్శి ఎం.ఇబ్రాయిల్, వీవీ రెడ్డి, టి.నిర్మల(తాడేపల్లిగూడెం), వి.మాలతినాయుడు, వైరా కళాపోషకులు నంబూరి శ్రీనివాసరావు తదితరులు తమ గానంతో అలరించారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శనివారం జిల్లా ట్రెజరీ అధికారి వి.సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ డైరీ నాలుగు రంగాల (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, కోల్, ఇపీఎస్) పెన్షనర్ల సమాచారం ఉంటుందని అసోసియేషన్ బాధ్యులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా టీజీఓ ప్రధాన కార్యదర్శి, జిల్లా ట్రెజరర్ల సంఘం అధ్యక్షుడు మోదుగు వేలాద్రి, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.గోపీచంద్, కల్యాణం నాగేశ్వరరావు, కృష్ణారావు, మాధవరావు పాల్గొన్నారు.

పొంగులేటి రాజకీయ ప్రస్థానం వీడియో ఆవిష్కరణ



వీడియోను ఆవిష్కరిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ ప్రస్థానంపై రైట్ చాయిస్ అకాడమీ చైర్మన్ మెండెం కిరణ్‌కుమార్ 'శీనన్న శపథం' శీర్షికతో రూపొందించిన ప్రత్యేక వీడియోను మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. శీనన్నను అభిమానించే ప్రతి ఒక్కరూ మెచ్చేలా ఈ వీడియో ఉందని పేర్కొన్నారు.

గ్రంథాలయం పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో కూలిపోయిన జిల్లా గ్రంథాలయ భవనాన్ని సీపీఎం నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. గత మూడేళ్ల క్రితం ఈ గ్రంథాలయం భవనాన్ని పరిశీలించి కూలిపోతుందని అధికారులు తేల్చి చెప్పినా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. కనీసం విలువైన పుస్తకాలను భద్రపర్చకుండా గ్రంథాలయ కమిటీ అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. జిల్లా ప్రజలకు అందుబాటులోకి తక్షణమే నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, చింతల చెర్వు కోటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, జిల్లా నాయకులు మాదినేని రమేశ్, తుశాకుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరు కారం
వినోద	సైంధవ్
సాయిరాం	నా సామిరంగ, గుంటూరుకారం
ఆదిత్య	గుంటూరు కారం
శ్రీనివాస	గుంటూరు కారం
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్



భోగి పండ్లు కొంటున్న ప్రజలు



పూలు కొంటున్న మహిళ



పతంగుల విక్రయాలు



అలంకరణ వస్తువులు..

సంక్రాంతి.. సందడి!



ముగ్గుల్లో దిద్దే రంగులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఊరూ.. వాడా అంతా సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకునేందుకు సంసిద్ధమయ్యారు. మూడు రోజుల పాటు జరుపుకునే ఈ పండుగ అన్ని వర్గాల వారికి ప్రత్యేకం కావడంతో అందుకు అవసరమయ్యే వస్తువులను కొనేందుకు ప్రజలు మార్కెట్‌లో బిజీ అయ్యారు. పండుగ సంబరాలకు ప్రతి ఇంటా అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మార్కెట్‌లో ఎక్కడ చూసినా సంక్రాంతి కళే కనబడుతోంది. మహిళలకు సంక్రాంతి ముగ్గుల పండుగ కాగా, పిల్లలు, యువతకు పతంగుల పండుగ అయితే రైతులకు పాడి పంటల పండుగ. పండుగను అంబరాన్నంటేలా సంబరంగా జరుపుకునేందుకు అవసరమైన వాటిని కొనుగోలు చేసుకునే పనిలో జనమంతా నిమగ్నమయ్యారు.

– ఖమ్మంగాంధీచౌక్

- జోరుగా ముగ్గుల రంగులు కొనుగోళ్లు
- గాలి పతంగులతో పిల్లల సరదా
- భోగి పండ్లు, నవధాన్యాలు, అలంకరణ వస్తువుల విక్రయాలతో మార్కెట్లు బిజీబిజీ

రంగు రంగుల ముగ్గులు..

ఇళ్ల లోగిళ్లలో ముగ్గులు వేసే రంగురంగుల ముగ్గుల విక్రయాలు మార్కెట్లో జోరుగా సాగుతున్నాయి. భోగి మొదలు మూడు రోజుల పాటు ఇళ్ల ముందు మగువలు కనువిందు చేసే ముగ్గులు వేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకు అవసరమయ్యే ముగ్గుల రంగులు, చమ్కీలతో ఉన్న రంగులు, బొమ్మల కొలువులు, అలంకరణల వస్తువులను కొనుగోళ్లు చేస్తున్నారు. సంక్రాంతి అంటేనే కొత్తదనం. ఇళ్లను కొత్త వస్తువులు, అలంకరణల వస్తువులను అమర్చుకొని కొంగొత్తగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇక మహిళలు ఇష్టమైన గాజులను కూడా కొనుగోలు చేస్తున్నారు.

రేగి పండ్లు, నవధాన్యాల విక్రయాలు..

భోగి పండుగ రోజున చిన్న పిల్లలపై భోగి పండ్లు (రేగి పండ్లు) పోయడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా పోయడం వల్ల పిల్లల ఆరోగ్యం, ఆయుష్షు పెరుగుతుందని ఓ నమ్మకం. దీంతో భోగి పండ్లు కొనుగోలు చేసేందుకు జనాలు ఎగబడుతుండడంతో మార్కెట్‌లో వాటికి గిరాకీ పెరిగింది. అంతేకాక ముగ్గుల్లో పెట్టే గొబ్బెమ్మల్లో కూరగాయలు, గరిక, నవధాన్యాలతో పాటు రేగి పండ్లను పోస్తారు. ఈనేపథ్యాన నవధాన్యాలను ప్యాకెట్లుగా చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

పతంగుల జోరు..

పిల్లలు మొదలు యువత, పెద్దల వరకు పతంగులు ఎగురవేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. భిన్నమైన పేర్లతో ఆకర్షణీయమైన పతంగుల విక్రయాలు మార్కెట్‌లో సాగుతున్నాయి. పతంగిని బట్టి రూ. 20 మొదలు రూ. 600ల వరకు కూడా ధరలు ఉంటున్నాయి. విమానాలు, రాకెట్లు, సినిమా పేర్లు, హీరోలతో ఉన్న పతంగులు, సీతాకోక చిలుకలు వంటి పతంగులు మార్కెట్‌లో లభిస్తుండడంతో ప్రధానంగా పిల్లలు కొనేందుకు ఎగబడుతున్నారు. సంక్రాంతి సందర్భంగా పాఠశాలలకు సెలవులు ఉండడంతో పిల్లలు గాలి పటాలను ఎగుర వేస్తూ సంబరాల్లో మునిగి తేలుతున్నారు.

పండుగకు ప్రత్యేకం ముగ్గులు..



సంక్రాంతి అంటే ముగ్గులకు ప్రత్యేకం. చిన్నప్పటి నుంచి పండుగ వచ్చిందంటే సంక్రాంతి ప్రత్యేకతను తెలుపుతూ ఇళ్ల ముందు పోటీ పడి ముగ్గులు వేస్తాం. అందుకు అవసరమయ్యే తీరొక్క రంగు ముగ్గులను కొనుగోలు చేశాం. ముగ్గులు వేశాక రంగులు అద్ది శుభాకాంక్షలు తెలుపుతాం.

– గాజుల భారతి, బైపాస్ రోడ్, ఖమ్మం

పతంగులు ఎగరేస్తాం..



సంక్రాంతి రోజు పతంగులు ఎగురేస్తాం. పండుగ సెలవులు ఉండడంతో పిల్లలు, స్నేహితులతో కలిసి మైదాన ప్రాంతంలోకి వెళ్లి పోటీ పడి పతంగులను ఎగురేస్తాం. ఐదు పతంగులు కొనడంతో పాటు పిల్లలకు ఇష్టమైన పతంగులను కొనిచ్చా. పతంగులు ఎగురవేయడం ఎంతో సరదాగా ఉంటుంది.

– శీలం కార్తీక్, నాయుడుపేట, ఖమ్మం రూరల్ మండలం

గాజుల గమ్మత్తు..!



ఖమ్మంలో గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

- షాపులకు ఒక్క కొడుకు ఉన్న తల్లుల పరుగులు
- మూఢనమ్మకమని కొట్టిపారేస్తున్న పండితులు

ఖమ్మంగాంధీచౌక్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పలుప్రాంతాల్లో ఓ మూఢనమ్మకం చక్కర్లు కొడుతోంది. ఒక్క కొడుకు ఉన్న తల్లులు ఇద్దరు కొడుకులు ఉన్న తల్లలు వద్దకు వెళ్లి డబ్బులు తీసుకుని గాజులు కొనుగోలు చేసి సంక్రాంతి పండుగ నాడు వేసుకోవాలనేది ఈ ప్రచారం. ఈ గాజులను కనుమ రోజు తీసేయాలని చెబుతున్నారు. లేకుంటే కీడు జరుగుతుందని ఈనోట, ఆనోట విస్తృతంగా ప్రచారం జరగడంతో ఒక్క కొడుకు ఉన్న తల్లులు ఎందుకైనా మంచిదని ఇద్దరు కొడుకులు ఉన్న తల్లుల దగ్గరకు వెళ్లి డబ్బు అడిగి మరీ గాజులు కొంటున్నారు. ఈ విషయమై పండితులు మాత్రం శాస్త్రంలో ఎక్కడా ఆ విధంగా లేదని కొట్టిపారేస్తున్నారు. ఇదంతా తప్పుడు ప్రచారం చేస్తున్నారని తేల్చి చెబుతున్నారు. కాగా, కొందరు వ్యాపారులు కూడా ఈ అంశాన్ని మరింతగా ప్రచారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

దుకాణాల్లో రద్దీ..

ప్రచారం నేపథ్యాన నగరంలోని గాజులు దుకాణాలు కిక్కిరిస్తున్నాయి. ఉదయం 10 గంటలకు తెరుచుకుంటున్న షాపులు రాత్రి 10 గంటల వరకు రద్దీగానే ఉంటున్నాయి. హిందువులే గాక అన్నిమతాల వారు ఈ నమ్మకాన్ని పాటిసుస్తుండడంతో తమ వ్యాపారం బాగానే సాగుతుందని గాజుల దుకాణాల యజమానులు చెబుతున్నారు. సహజంగా ప్రతీ పండుగకు గాజుల వ్యాపారం బాగుటుందని.. ఈసారి రెట్టింపైందని తెలుస్తోంది. కాగా, నిరక్షరాస్యులే కాక అక్షరాస్యులు కూడా ఇలా గాజులు వేయించుకుంటుండడం గమనార్హం.

సర్పంచ్, కార్యదర్శులను సస్పెండ్ చేయాలి



ఎంపీఓకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం గ్రామ పంచాయతీలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న సర్పంచ్, కార్యదర్శులను వెంటనే సస్పెండ్ చేయాలని గ్రామస్తులు ఎంపీఓకు ఫిర్యాదు చేశారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివకు పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు, సొసైటీ డైరెక్టర్ బొల్లినేని వెంకటేశ్వర్లు లకు వినతి పత్రం అందించి పలు విషయాలను వివరించారు. వాటిపై ఈ నెల 17న విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాప్రయోజనాలకు వదిలేసి పంచాయతీ ట్రాక్టర్‌ను సర్పంచ్ రాంబాయి తన సొంత పనులు, వ్యవసాయ పనులకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. గతంలో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేస్తే అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దలు అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి నరసింహారావుకు తెలిపినా సర్పంచ్‌కు వత్తాసు పలుకుతున్నారని, గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు కూడా నాణ్యత ప్రమాణాలు లేవని ఆరోపించారు. పనులు చేయకుండా బిల్లులు కూడా డ్రా చేశారని అన్నారు. ట్రాక్టర్ దుర్వినియోగం, నిధులు వినియోగం, అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వీటిపై సమగ్ర విచారణ జరిపి సర్పంచ్, కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరి సురేష్, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దూదేకులను బీసీ–ఈలో చేర్చాలి



తుమ్మలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సయ్యద్ బాషా

ఖమ్మం మామిళ్లగూడెం: దూదేకులను బీసీ–బీ నుంచి బీసీ–ఈలో చేర్చాలని రాష్ట్ర నూర్‌భాషా దూదేకుల ముస్లిం, మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్‌కె.సయ్యద్ బాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపాక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్ కోకాపేటలోని ఆత్మగౌరవ భవనానికి కేటాయించిన రెండెకరాల భూమి, దానికి అవసరమయ్యే నిధులు విడుదల చేయాలని, ఖమ్మంలో సంఘానికి కేటాయించిన భవన నిర్మాణానికి అయ్యే నిధులు కూడా ఇవ్వాలని, దూదేకులకు ఫెడరేషన్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. వినతి అందించిన వారిలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఖాదర్‌భాయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిబాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల నివాళి..

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడుకు చెందిన మాజీ సర్పంచ్ రామసహాయం సునీతాదేవి ఇటీవల మృతి చెందడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం గ్రామానికి వెళ్లి సునీతాదేవి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సునీతాదేవి కుమారుడు న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామసహాయం అరవింద్‌రెడ్డిని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సాధు రమేశ్ రెడ్డి, నరేశ్‌రెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, నల్లమల ఆనంద్, మద్దినేని మధు, విక్రమ్ రెడ్డి, నితీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాలూనాయక్ మృతి పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: కామేపల్లి గ్రామ సీనియర్ నాయకుడు భూక్యా లాలూనాయక్ అకాల మృతితో కాంగ్రెస్ పార్టీ పెద్ద దిక్కును కోల్పోయామని, ఆయన లేని లోటు తీర్చలేనిదని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యాన శనివారం లాలూనాయక్ సంతాప సభను మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి అధ్యక్షత నిర్వహించగా.. ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పదవి లేకున్నా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశారని, పార్టీ కోసం తప్పా పదవుల కోసం ఆశపడిన వ్యక్తి కాదన్నారు.అనంతరం మండల పార్టీ ఆధ్వర్యాన లాలూనాయక్ కుటుంబసభ్యులకు రూ.2.35 లక్షల నగదును అందజేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డీసీసీ ప్రెసిడెంట్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఇల్లెందు మున్సిపాలిటీ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, మద్దినేని రమేశ్‌బాబు, ఏపూరి మహేందర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

కూసుమంచి: కూసుమంచి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుండా రవీందర్‌రెడ్డి హఠాన్మరణం చెందగా శనివారం ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ చెన్నా మోహన్, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, నాయకులు ఎండీ హఫీజుద్దీన్, బెల్లంకొండ శరత్, ఎండీ కలీం, ఎడవెల్లి రాంరెడ్డి, వెంకటరెడ్డి, బారి వీరభద్రం , కిరణ్, భూపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

'తమ్మినేని' పరామర్శ

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువులో అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఎం మండల కమిటీ సభ్యుడు వేగినాటి వెంకట్రావును సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం పరామర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేశ్, జిల్లా కమిటీ సభ్యుడు షేక్.బషీరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు మహేందర్, దొడ్డ లింగస్వామి, శ్రీదేవి, వెంకటనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌అలీ

ఖమ్మంరూరల్: ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్‌కె.మహబూబ్‌అలీ అన్నారు. శనివారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాద మూఢనమ్మకాల సమ్మిళితంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వెంటనే నిర్వహించాలని, పేర్కొన్నారు. పీఆర్‌సీ కమిటీ రిపోర్టు తెప్పించుకొని నాణ్యమైన ఫిట్‌మెంట్లు, ఉపాధ్యాయఉద్యోగులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఎస్.నవీన్‌కుమార్, పి.మహేశ్, ఎస్.శైలజ, ఎం.ప్రసాదరావు, ఎం.శ్రీలత, సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న స్వామికి వైభవంగా పుష్పయాగం



పుష్పయాగానికి పూలు తీసుకెళ్తున్న భక్తులు



అలంకరణలో స్వామివారు

ఖమ్మంగాంధీచౌక్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నగరంలోని కమాన్ బజార్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామి వారికి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. శనివారం తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని ధ్వజ స్తంభం వద్ద పసుపుకుంకుమలను సమర్పించుకొని పుష్పాభిషేకాన్ని తిలకించి తరించేందుకు క్యూ లైన్లలోకి చేరారు. పలు సేవా సమితిల భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని సేవలందించారు. ఆలయ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో అర్చకులు వేద మంత్రాల నడుమ స్వామి వారికి పుష్పయాగం చేశారు.ఈ కార్యక్రమంలో నగరంలోని పలువురు ప్రముఖులు, వ్యాపారులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పీఎస్‌ఆర్ కిట్లను పంపిణీ చేస్తున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని మండ్రాజుపల్లిలో పీఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా క్రికెట్ కిట్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో దాగి ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ట్రస్ట్‌చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఎంపీపీ వజ్జా రమ్య, పార్టీ నాయకులు కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, సీతారాములు, మైశా శంకర్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, గరిడేపల్లి రామరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, వెంకన్న, వంగవీటి నాగేశ్వరరావు, కట్టెకోల సుధాకర్, హనుమంతరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ముగ్గుల పోటీలు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ సంఘాల ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు నిర్వహించారు. శనివారం ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో మహిళలు, చిన్నారులు పాల్గొని పోటాపోటీగా ముగ్గులు వేసి అందంగా రంగులు దిద్దారు. అనంతరం నిర్వాహకులు పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంలోని 51వ డివిజన్‌లో విజేతకు బహుమతి అందిస్తున్న కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం




ఖమ్మంఅర్బన్: శ్రీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ముగ్గుల పోటీ



తిరుమలాయపాలెం: పిండిప్రోలులో మన గ్రోమోర్ ఆధ్వర్యాన స్లో సైకిల్ రేస్ పోటీలు

గోటి తలంబ్రాల వడ్లకు పూజలు



వడ్లకు పూజలు చేస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: గోటి తలంబ్రాల కోసం రైతులు వడ్లను వితరణగా ఇవ్వగా శ్రీ లక్ష్మీ బాలాజీ సేవా సమితి అదే రైతులతో శనివారం శ్రావణ నక్షత్రం శుభదినం కావడంతో రామాలయంలోగోటితో ఆ వడ్లను వలిచే ప్రక్రియను ప్రారంభించి వడ్లను వలిచేందుకు ఇళ్లకు తెచ్చుకున్నారు. నగరానికి చెందిన శ్రీ లక్ష్మీబాలాజీ సేవా సమితికి వైరా మండలం కొండకొడిమ రైతులు గోటి తలంబ్రాలకు వడ్లను ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. సమితి అధ్యక్షురాలు వడ్డే లక్ష్మి ఆధ్వర్యాన ఆ గ్రామానికి వెళ్లి రైతులు నరినేని అశోక్, కాస్తల సత్యనారాయణ, పుట్ట వెంకటేశ్వరరావు, కొండబాల పుల్లారావు, వకదాని వెంకటేవ్వరరావు, దొంతుబోయిన కృష్ణ, మల్ల యాలాద్రి, నూకల రామారావులు ఇచ్చిన ధాన్యాన్ని అదే గ్రామంలోని రామాలయానికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా పూజలు చేసి తలంబ్రాల కోసం గోటితో వలిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆ వడ్లను వలిచేందుకు తమ ఇళ్లకు తీసుకొచ్చారు. భద్రాచలం శ్రీరామ నవమి ఉత్సవాల సమాయానికి గోటి తలంబ్రాలను తయారు చేసి వైభవంగా ప్రదర్శించి సీతారాముల కల్యాణ మహోత్సవానికి సమర్పించనున్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు..



కామేపల్లి: గోవింద్రాలలో అక్షింతలతో భక్తులు

నేలకొండపల్లి/కామేపల్లి/తిరుమలాయపాలెం: మండలాల్లోని వివిధ గ్రామాల్లో అయోధ్య రామ మందిరం నుంచి తీసుకొచ్చిన అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం పల్లెల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈనేపథ్యాన నేలకొండపల్లి మండలం అనాసాగారంలో కోటి హనుమంతరావు ఆధ్వర్యాన, కోరట్లగూడెంలో గ్రామస్తులు అక్షింతలను పంపిణీ చేశారు. అలాగే కామేపల్లి మండలంలోని ముచ్చర్ల, గోవింద్రాల, రుక్కితండా తదితర గ్రామాల్లో శ్రీరామ భక్తమండలి ఆధ్వర్యాన పంపిణీ చేయగా.. తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడులో మేళతాళాలతో గ్రామస్తులు ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కాగా, అక్షింతలు కోసం భక్తులు పోటీ పడి అందుకుంటున్నారు. ఈ కార్యక్రమాల్లో తోట సుబ్బయ్య, వాసంశెట్టి నాగేశ్వరరావు, నాగార్జున, ఉపేందర్ రావు, ఆమంచి దయాకర్, వేములపల్లి రామయ్య, వేములపల్లి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.